




ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 182 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦https:www.prajarepublic.com ✦ వెల - 1/- | గురువారం 06 ఫిబ్రవరి 2025


RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


## 'పరీక్షా పే చర్చ' ఈసారి కొత్తగా..
## మోదీతో పాటు దీపికా పదుకొణె, విక్రాంత్ మస్సే

**ప్రధాని మోదీ ఏటా నిర్వహిస్తున్న పరీక్షా పే చర్చలో ఈసారి బాలీవుడ్ నటీనటులు, ఇతర ప్రముఖులు కూడా పాల్గోనున్నట్లు తెలుస్తోంది.**

దిల్లీ, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని పోగొట్టేందుకు ప్రధానమంత్రి ఏటా 'పరీక్షా పే చర్చ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఫిబ్రవరి 10న ఢిల్లీలోని భారత్ మండపం టౌన్ హాల్ లో ఏర్పాటుచేశారు. అయితే, ఎప్పటి మాదిరిగా కాకుండా ఈసారి 'పరీక్షా పే చర్చ 2025' తెలుస్తోంది. ఈ ఏడాది ప్రధాని మోదీతో పాటు బాలీవుడ్ నటీనటులు, ఇతర రంగాల ప్రముఖులు కూడా ఇందులో పాల్గోనున్నట్లు అధికారులు వెల్లడించారు.





సద్గురు జగ్గీ వాసుదేవ్, నటీనటులు దీపికా పదుకొణె, విక్రాంత్ మస్సే, భూమి పడ్నేకర్, దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్, పారా అథ్లెట్ అవని లేఖరా, రచయిత రుజుతా దివేకర్, ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ రాధికా గుప్తా, మానసిక నిపుణురాలు సోనాలీ సబర్వాల్, ఫుడ్ ఫార్మర్ రేవంత్ హిమత్సంగ్కా, టెక్నికల్ గురూజీ గౌరవ్ చౌదరీ వంటి ప్రముఖుల పాడ్కాస్ట్ ఎపిసోడ్స్ను ప్రదర్శించనున్నారు. వీరు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుని వారిలో స్ఫూర్తి నింపనున్నారు. పరీక్షా పే చర్చ కోసం గతేడాది డిసెంబర్ 14న రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా... జనవరి 24 ఉదయం 10గంటల వరకు వరకు దేశవ్యాప్తంగా 9.72 లక్షల మంది విద్యార్థులు, 1.01లక్షల మంది టీచర్లు, 24,289 మంది తల్లిదండ్రులు రిజిస్టర్ అయినట్లు అధికారులు వెబ్సైట్లో పేర్కొన్నారు. ఈ ఈవెంట్లో పాల్గొనేందుకు 2500 మందిని ఎంపిక చేస్తారు. వారికి కేంద్ర విద్యాశాఖ నుంచి పీపీసీ కిట్లు అందిస్తారు. పరీక్షా పే చర్చలో పాల్గొనేవారిని ఎంపిక చేసేందుకు https://innovateindial, mygov.in/లో ఆన్లైన్ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో ఓ పోటీ నిర్వహిస్తారు. ఎంపికైన విద్యార్థులు ప్రధానితో నేరుగా జరిగే చర్చా కార్యక్రమంలో పాల్గొంటారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోదీ సమాధానమిస్తారు. విద్యార్థులకు తగిన సూచనలు చేస్తారు.

## భారత వలసదారుల తరలింపు.. స్పందించిన అమెరికా

**ఇమ్మిగ్రేషన్ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం తమ విధానమని అమెరికా వెల్లడించింది.**

దిల్లీ, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): తమదేశంలో అక్రమంగా ఉంటున్న భారత వలసదారులను వెనక్కి పంపడంపై అమెరికా స్పందించింది. తమ దేశం, ప్రజల భద్రత కోసం ఇమ్మిగ్రేషన్ చట్టాలను అమలు చేయడం అత్యంత ఆవశ్యకమని, అది తమ విధానమని పేర్కొంది. ఆ విమాన ప్రయాణం గురించి ఇంతకుమించి ఏం చెప్పలేమని వ్యాఖ్యానించింది. ఈ మేరకు భారత్లోని యఎస్ దౌత్యకార్యాలయ ప్రతినిధి మాట్లాడారు.

భారత్కు చెందిన 104 మంది అక్రమ వలసదారులతో అమెరికా నుంచి బయలుదేరిన సైనిక విమానం బుధవారం అమృత్సర్కు చేరుకున్న సంగతి తెలిసిందే. నిన్న మధ్యాహ్నం శ్రీ గురు రాందాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సీ-17 గ్లోబ్మాస్టర్ విమానం దిగింది. ఇందులో హరియాణా, గుజరాత్, పంజాబ్, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్.. తదితర రాష్ట్రాలకు చెందినవారు ఉన్నారు. ఈ తరలింపు వేళ వలసదారులతో అమానవీయంగా ప్రవర్తించారని విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఈ తరుణంలో విదేశాంగమంత్రి జై శంకర్ పార్లమెంట్లో ప్రకటన చేశారు. తరలింపు ప్రక్రియ కొత్తదేమీ కాదని అన్నారు. "అమెరికాలో ఏళ్ల నుంచి అక్రమ వలసదారుల తరలింపు ప్రక్రియ జరుగుతూనే ఉంది. ఇది ఏ ఒక్క దేశానికి సంబంధించిన విధానం కాదు. అన్నిదేశాల అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపిస్తోంది. 2012లో ఈ సంఖ్య 530గా ఉండగా.. 2019లో 2వేలకు పైగా ఉంది. అక్రమ వలసలను



అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలి. తమ దేశస్థులు విదేశాల్లో చట్టవిరుద్ధంగా ఉంటే వారిని స్వదేశాలకు రప్పించడం ఆయా దేశాల బాధ్యత" అని జైశంకర్ స్పష్టం చేశారు.

## రాజకీయాలకు విజయసాయి గుడ్బై .. స్పందించిన జగన్

**వైకాపాను వీడిన రాజ్యసభ ఎంపీల పై ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ స్పందించారు.**

**రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వాసం ముఖ్యమన్నారు.**

అమరావతి, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): వైకాపాను వీడిన రాజ్యసభ ఎంపీలపై ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ స్పందించారు. రాజకీయాల్లో వ్యక్తిత్వం, విశ్వాసం ముఖ్యమన్నారు.



ప్రలోభాలకు లొంగో, భయపడో వ్యక్తిత్వం తగ్గించుకుంటే ఎలా? అని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి సహా పార్టీ నుంచి వెళ్లిపోయిన అందరికీ ఇదే వర్తిస్తుందన్నారు. ఇంకా ఒకరో.. అరో వెళ్లిపోయేవాళ్లుంటే వాళ్లకైనా అంతేనని వ్యాఖ్యానించారు. వైకాపా నేడు ఉందంటే అది నాయకుల వల్ల కాదని చెప్పారు. ఇటీవల విజయసాయిరెడ్డి వైకాపా ప్రాథమిక సభ్యత్వానికి, ఎంపీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలుగుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో జగన్ స్పందించారు.

## బిగ్ బాస్ ఫేమ్ శేఖర్ బాషాపై
## మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఫిర్యాదు

**బిగ్ బాస్ ఫేమ్, ఆర్ జే శేఖర్ బాషాపై మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ నార్సింగి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.**

హైదరాబాద్, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): బిగ్ బాస్ ఫేమ్, ఆర్జే జే శేఖర్ బాషాపై మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ నార్సింగి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శేఖర్ బాషా తన కాల్ రికార్డింగ్ చేశారని.. పరువుకు భంగం కలిగించారని అందులో పేర్కొన్నారు. ఈమేరకు ఆయనపై బీఎన్ఎస్ 67, 79 సెక్షన్ల కింద కేసు



నమోదు చేశారు. గతంలో జానీ మాస్టర్పై కూడా ఆమె ఫిర్యాదు చేశారు.

## కొనసాగుతున్న ఏపీ క్యాబినెట్ భేటీ..
## పలు కీలక అంశాలకు ఆమోద ముద్ర!

**ఏపీ మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీల పలు కీలక అంశాలకు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది.**



అమరావతి, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ భేటీల పలు కీలక అంశాలకు ఆమోదముద్ర వేసినట్లు తెలుస్తోంది. ఎంఎస్ఎంఈ, ఎంఈడీపీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, టెక్స్టైల్ అండ్ గార్మెంట్స్ పాలసీల్లో పలు సవరణలకు మంత్రివర్గం పచ్చజెండా ఊపినట్లు సమాచారం.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా పారిశ్రామిక వేత్తలకు చేయూత అందించేలా పాలసీల్లో సవరణలకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. వారికి విద్యుత్ సహా పలు విభాగాల్లో ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఆమోదం తెలిపిన దాదాపు రూ.45వేల కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గతంలో తెదేపా అధికారంలో ఉండగా చేపట్టిన నీరు-చెట్టు పనులకు సంబంధించి ఇంకా పెండింగ్లో ఉన్న బిల్లులకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు సమాచారం. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నిర్మించే ఇళ్లకు కొత్త టెండర్లు పిలిచే అంశంపై చర్చ జరిగింది. తితిదేలో పోటు కార్మికులకు సంబంధించిన 15 పోస్టులను సూపర్వైజర్ స్థాయికి పెంచేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. తిరుపతి జిల్లా తమ్మినపట్నం, కొత్తపట్నంలో చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి పరిహారం కింద ఎకరాకు రూ.8లక్షలు చొప్పున దాదాపు రూ.79కోట్లు చెల్లించేందుకు అంగీకారం తెలిపినట్లు సమాచారం. మద్యం ధరలపై



క్యాబినెట్ లో చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

## సీఎం రేవంత్ అధ్యక్షతన కొనసాగుతున్న సీఎల్పీ భేటీ

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం కొనసాగుతోంది.**

హైదరాబాద్, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ సమావేశం కొనసాగుతోంది. మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరుగుతున్న సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు హాజరయ్యారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలు, ఎస్సీ వర్గీకరణ, కులగణన సర్వే, బడ్జెట్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నట్లు సమాచారం. తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చ జరిగే అవకాశముంది. ఈ భేటీకి కొనసాగింపుగా రెండు మూడు జిల్లాల వారీగా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీ, మహేష్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు. ఒకపక్క ఎస్సీ వర్గీకరణ అమలుకు సర్కారు శ్రీకారం చుట్టింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు ఇస్తామంది. మరోపక్క తాము కోరిన పనులు కాలేదంటూ కొందరు పార్టీ ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశం ఏర్పాటు



నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

## సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా యూజీసీ కొత్త నిబంధనలు: కేటీఆర్

**యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాను నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు.**

దిల్లీ, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): యూజీసీ నూతన మార్గదర్శకాలపై తమ అభిప్రాయాలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్కు నివేదించినట్లు మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు.

తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు కేంద్ర మంత్రిని కలిసినట్లు చెప్పారు. రాష్ట్ర వర్సిటీల్లో సెర్చ్ కమిటీల బాధ్యతను గవర్నర్కు అప్పగించేలా నిబంధనలు రూపొందించారన్నారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా కొత్త మార్గదర్శకాలు తీసుకొచ్చారని పేర్కొన్నారు. "నూతన నిబంధనల వల్ల ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు నష్టం జరుగుతుంది. గవర్నర్ల ద్వారా వర్సిటీలను కేంద్రం అధీనంలోకి తీసుకోవాలనుకుంటున్నారు. యూజీసీ నిబంధనల అభ్యంతరాలపై 6 పేజీలతో నివేదిక ఇచ్చాం. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా నిర్ణయం తీసుకోవద్దని విన్నవించాం. మరోవైపు ఎన్ హెచ్-365బి రహదారిని పొడిగించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కోరాం" అని కేటీఆర్ తెలిపారు.



## విద్యుత్ ఛార్జీలు తగ్గాలి.. బడులు తెరిచేనాటికి డీఎస్సీ పూర్తవ్వాలి :సీఎం చంద్రబాబు ఆదేశం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కొద్దిసేపు మంత్రులతో మాట్లాడారు.

అమరావతి, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కేబినెట్ భేటీ ముగిసిన తర్వాత ఆయన కొద్దిసేపు మంత్రులతో మాట్లాడారు. వచ్చే మూడు నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంత్రులు కీలకంగా వ్యవహరించి ప్రచారం నిర్వహించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం అమలుపై మంత్రులతో చర్చించారు. ఏప్రిల్లో మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని మంత్రులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.



మంత్రులు గేరు మార్చాలి... సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం

కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్రం మరో రూ.14 వేలు కలిపి ఇచ్చే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్రంతోపాటు మూడు విడతలుగా రాష్ట్రం ఆర్థిక సాయం ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలిపారు. బడులు తెరిచే నాటికి డీఎస్సీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు పెరగటానికి వీల్లేదని సీఎం తేల్చి చెప్పారు. సమగ్ర పవర్ మేనేజ్మెంట్తో రానున్న రోజుల్లో విద్యుత్ ఛార్జీలు వీలైతే తగ్గాలే తప్ప పెరగటానికి వీల్లేదన్నారు. సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5 లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎన్ని పెట్టుబడులు అమల్లోకి వచ్చాయో ఎప్పటికప్పుడు పరిశీలించి అందుకు తగ్గట్టు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

### మంత్రులు గేరు మార్చాలి...

శాఖల పరంగా మంత్రుల పనితీరు మెరుగుపడాలని సీఎం అన్నారు. అందరూ గేరు మార్చాలని సూచించారు. "మొదటి ఆరు నెలలు మంత్రుల పనితీరును అంతగా పట్టించుకోలేదు. ఇకపై ఎవరినీ ఉపేక్షించను. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఆప్కోస్ ద్వారా కాకుండా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని శాఖల వారీగా తీసుకోవచ్చు. వాట్సప్ గవరెన్స్కు మంచి స్పందన వస్తోంది. వివిధ పథకాల అమలు తీరుపై చేయిస్తోన్న సర్వేల్లో సానుకూల స్పందన వస్తోంది" అని అన్నారు.

ఇకపై నాణ్యమైన, పోషక విలువలు కలిగి సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై కేబినెట్లో చర్చ జరిగింది. మెనూలో చేసిన మార్పులపై సమావేశంలో లోకేశ్ వివరించారు. ప్రాంతాల వారీగా పిల్లలు ఇష్టపడి తినే విధంగా మెనూలో తీసుకొచ్చిన మార్పులను లోకేశ్ ప్రస్తావించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారాన్ని లోకేశ్ కోరారు. ఈ పథకం అమలుకు అవసరమైన నాణ్యమైన పోషకాలు కలిగిన సన్న బియ్యం పౌరసరఫరాల శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ తెలిపారు.

## రాజధాని అమరావతిలో టెండర్లకు ఈసీ అనుమతి

**ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు ఎన్నికల సంఘం అనుమతిచ్చింది.**


అమరావతి, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు పిలిచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతిచ్చింది. కృష్ణ-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో సీఆర్డీఏ పరిధిలో చేపట్టబోయే పనులకు అనుమతి కోసం ఇటీవల సీఆర్డీఏ అధికారులు ఈసీకి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఈసీ.. రాజధానిలో పనులకు అభ్యంతరం లేదని లేఖ ద్వారా స్పష్టం చేసింది. టెండర్లు పిలిచేందుకు అనుమతించింది. అయితే, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక మాత్రమే టెండర్లు ఖరారు చేయాలని లేఖలో పేర్కొంది.



## ఫిబ్రవరిలోనే మండుతున్న ఎండలు.. 35 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు

**ఏపీలో ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.**

అమరావతి, ఫిబ్రవరి 6, (రిపబ్లిక్ న్యూస్): ఏపీలో ఫిబ్రవరి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గురువారం కర్నూలు జిల్లా సి. బెలగళ్, సత్యసాయి జిల్లా కొత్త చెరువు, నంద్యాల, కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్, ప్రకాశం జిల్లా కనిగిలో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రొద్దుటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, కోనసీమ జిల్లా కపిలేశ్వరంలో 35.8



డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 35.7, ఏలూరు, కాకినాడలో 35.6, విజయనగరంలో 35.5, మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 35.7, బాపట్ల, తణుకులో 35.5, శ్రీకాకుళం జిల్లా పొందూరులో 35.4, తిరుపతి జిల్లా రేణిగుంటలో 35.53, పల్నాడు జిల్లా మాచర్లలో 35.4, చిత్తూరు జిల్లా నగరిలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- 1804: ఆక్సిజన్‌ను కనుగొన్న జోసెఫ్ ప్రీస్ట్లీ మరణం.
- 1911: అమెరికా దేశ 40వ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ జననం.
- 1923: వనపర్తి సంస్థానాధీశుడు, దౌత్యవేత్త, భారత పార్లమెంటు సభ్యుడు జే.రామేశ్వర్ రావు జననం.
- 1925: భారతీయ చిత్రకారుడు దామెర్ల రామారావు మరణించాడు (జ.1897). (చిత్రంలో)
- 1931: భారతీయ స్వాతంత్ర సమర యోధుడు, భారత జాతీయ కాంగ్రెస్ నాయకుడు మోతీలాల్ నెహ్రూ మరణం.
- 1932: భరాగోగా సుప్రసిద్ధులైన రచయిత భమిడిపాటి రామగోపాలం జననం.
- 1956: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మొట్ట మొదటి మహిళా అధ్యక్షురాలు కావలి ప్రతిభా భారతి జననం.
- 1976: బెంగాలీ భారతీయ చిత్రనిర్మాత రిత్విక్ ఘటక్ మరణం.
- 2006: తెలుగు సినీ హాస్యనటి కల్పనా రాయ్ మరణం. (జ. 1950)



జోసెఫ్ ప్రీస్ట్లీ


రోనాల్డ్ రీగన్



జే.రామేశ్వర్ రావు


దామెర్ల రామారావు


మోతీలాల్ నెహ్రూ


భమిడిపాటి రామగోపాలం


కావలి ప్రతిభా భారతి


రిత్విక్ ఘటక్


కల్పనా రాయ్

# అందుకే 'తండేల్'లో సాయి పల్లవిని తీసుకున్నాం: అల్లు అరవింద్

తండేల్లో సాయి పల్లవిని ఎంపిక చేయడం గురించి అల్లు అరవింద్ మాట్లాడారు.



తన సహజమైన నటనతో అందరినీ ఆకట్టుకుంటారు నటి సాయి పల్లవి. మరికొన్ని గంటల్లో సత్యగా మరోసారి తన మార్క్ చూపించే పాత్రలో 'తండేల్'తో పలకరించనున్నారు. నాగ చైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ చిత్రంలో సాయి పల్లవిని ఎంపిక చేసుకోవడానికి గల కారణాన్ని వివరించారు. "ఈ చిత్రంలో సాయి పల్లవి ఎంపిక నా నిర్ణయమే. ఇది కమర్షియల్ నిర్ణయమని చెప్పాలి. ఈ పాత్ర కోసం నేను ముంబయి వెళ్లి ఎవరినీ తీసుకురాలేదు. ముంబయి నుంచి వచ్చిన వైట్ స్కిన్ అమ్మాయిలు ఈ పాత్రకు జీవం తీసుకురాలేరనిపించింది. ఇది ఎన్నో భావోద్వేగాలతో కూడిన పాత్ర. ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతుంది. ఇలాంటి గొప్ప పాత్రను నిజాయతీగా చేయాలి. సాయిపల్లవి అయితే వంద శాతం న్యాయం చేయగలదని నాకు అనిపించింది. ఆమె అసాధారణమైన నటి. అందుకే ఆమెను ఎంపిక చేశాం. మేము అనుకున్నట్లుగానే సాయిపల్లవి వందశాతం న్యాయం చేసింది" అని చెప్పారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో అల్లు అరవింద్ మాట్లాడుతూ ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన 'పుష్ప 2' గురించి మాట్లాడారు. ఈ క్రెడిట్ మొత్తం సుకుమార్కే చెందుతుందన్నారు. సుకుమార్, అల్లు అర్జున్ మంచి స్నేహితులని.. పుష్ప మొదటి భాగం నుంచి ప్రారంభమైన ఈ మేజిక్ ఇప్పుడు అంతర్జాతీయస్థాయిలో చరిత్ర సృష్టించిందన్నారు. ఇక 'తండేల్' విషయానికొస్తే.. శ్రీకాకుళం జిల్లా డి. మత్స్యలేశం గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు వేటకు వెళ్లగా, పాకిస్థాన్ కోస్ట్ గార్డుకు చిక్కి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించిన ఘటన ఆధారంగా రూపొందిన చిత్రం 'తండేల్. నాగచైతన్య కెరీర్లోనే భారీ బడ్జెట్తో తెరకెక్కింది. ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

# అందరిపై దయతో ఉండండి.. రష్మిక తాజా పోస్ట్ వైరల్

రష్మిక ఇన్స్టాలో పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ఒకరిపై ఒకరు దయతో ఉండాలని ఆమె పేర్కొన్నారు.





ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉండే రష్మిక తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్ గా మారింది. తన సినిమా విశేషాలు పంచుకునే ఆమె తాజాగా దయగా ఉండండి అంటూ పోస్ట్ పెట్టారు. "ఈ రోజుల్లో అందరిలో దయ తగ్గిపోతోంది. నేను మాత్రం అందరినీ ఒకేలా చూస్తాను. మీరంతా కూడా అలానే ఉండండి. ఒకరిపై ఒకరు దయతో ఉండండి" అని రాసుకొచ్చారు. తాను ధరించిన టీ షర్ట్ మీద కూడా దయ అనే రాసి ఉంది. దీంతో ఈ పోస్టు నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు. తాజాగా రష్మిక, విజయ్ దేవరకొండ జిమ్లో కలిసి కనిపించిన వీడియో వైరలైన విషయం తెలిసిందే. అయితే, జిమ్లో నుంచి బయటకు వచ్చిన విజయ్ కారులో కూర్చోగా.. రష్మిక కాలికి ఉన్న గాయం కారణంగా ఇబ్బందిపడుతూ కారు ఎక్కారు. ఈ వీడియోపై కొందరు విజయ్ను విమర్శిస్తున్నారు. రష్మికకు సాయం చేయొచ్చు కదా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రష్మిక పోస్ట్ వైరల్గా మారింది. ఇక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం రష్మిక నటించిన ఛావా విడుదలకు సిద్ధమైంది. ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీ మహరాజ్ జీవితాధారంగా రూపొందుతున్న చిత్రమే 'ఛావా'. శంభాజీ మహరాజ్ విక్కీ కౌశల్, ఆయన భార్య పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దీనితో పాటు సల్మాన్ ఖాన్ సరసన 'సికందర్'లో నటిస్తున్నారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఇది రానుంది. అలాగే వీటితో పాటు 'థామ', 'కుబేర', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్ బో' చిత్రాలతోనూ రష్మిక బిజీగా ఉన్నారు.

# 'లైగర్'.. నా కుమార్తె అసౌకర్యంగానే ఓకే చెప్పింది: నటి తండ్రి

'లైగర్' చిత్రాన్ని ఉద్దేశించి అనన్య పాండే తండ్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

ఆ సినిమా అంగీకరించడం అనన్యకు ఇష్టం లేదని అన్నారు.



విజయ్ దేవరకొండ, అనన్య పాండే, జంటగా నటించిన చిత్రం 'లైగర్'. 2022లో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఈ చిత్రాన్ని ఉద్దేశించి అనన్య తండ్రి చంకీ పాండే తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సినిమాలో యాక్ట్ చేయడం అనన్యకు ఏమాత్రం ఇష్టం లేదని, కాకపోతే తన వల్లే ఆమె ఇందులో నటించిందని అన్నారు. "అనన్యకు ఈ సినిమాలో అవకాశం వచ్చినప్పుడు తను ఎంతో అసౌకర్యంగా ఫీలైంది. గందరగోళానికి గురైంది. హీరోయిన్ పాత్రకు సెట్ కానని.. చిన్న పిల్లలా కనిపిస్తానని తను అనుకుంది. దాంతో నా వద్దకు వచ్చింది. "నాన్నా.. ఈ సినిమాకు నేను సెట్ కాననిపిస్తుంది. ఏం చేయమంటావు?" అని అడిగింది. అలా ఏమీ కాదని.. అదొక బిగ్ ప్రాజెక్ట్ కనుక సక్సెస్ అయితే పేరు వస్తుందని చెప్పి ఆమెను ఒప్పించాను. సినిమా విడుదలయ్యాక వచ్చిన విశ్లేషణలు చూసి.. తను చెప్పింది నిజమేననిపించింది. నిజంగానే ఆ పాత్రకు అనన్య చాలా యంగ్ అనిపించింది. ఆ సినిమా తర్వాత నేను తనకు ఎప్పుడూ సలహాలు ఇవ్వలేదు. ప్రాజెక్ట్ విషయంలో పూర్తి నిర్ణయం తనపైనే ఉంచాను. ప్రస్తుతం తనకు నచ్చిన ప్రాజెక్ట్‌లు ఎంచుకుంటూ కెరీర్లో ముందుకుసాగుతుంది" అని చంకీ పాండే తెలిపారు. విజయ్ దేవరకొండ నటించిన తొలి పాన్ ఇండియన్ మూవీగా 'లైగర్' విడుదలైంది. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించారు. రూ.150 కోట్ల బడ్జెట్తో దీనిని తీయగా.. రూ.60 కోట్లు మాత్రమే వసూళ్లు చేసినట్లు సినీ విశ్లేషకుల అంచనా. ఈ సినిమాలో యాక్ట్ చేయడం గురించి గతంలో అనన్య కూడా మాట్లాడారు. "నిర్మాత కరణ్ జోహార్, నా తల్లిదండ్రులు చెప్పడం వల్లే 'లైగర'న్ను ఓకే చేశాను. సాధారణంగా నా సినిమా రిలీజైన ప్రతిసారీ మా అమ్మ తన అభిప్రాయాన్ని చెబుతుంటారు. లైగర్కు జస్ట్ 'ఫన్!' అంటూ ఆమె రిప్లై ఇచ్చారు. నాకు వచ్చిన చెత్త రివ్యూ అదేననిపించింది. తప్పులు ప్రతిఒక్కరూ చేస్తారు. ఆ తప్పుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవాలని అర్థమైంది" అని అనన్య అన్నారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# దాయాదుల పోరు.. బయటకు చెప్పినంత ఈజీ కాదు: రవిశాస్త్రి

భారత క్రికెట్ ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై రవిశాస్త్రి స్పందించాడు.

తాను కూడా ఆ పదవిలో ఉన్నప్పుడు అలానే చెప్పినట్లు గుర్తుచేశాడు.



ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఫిబ్రవరి 23న మ్యాచ్ జరగనుంది. ఐసీసీ టోర్నీల్లో మినహా.. మరెక్కడా దాయాదుల పోరు లేకపోవడంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇటీవల భారత్ పాక్ మ్యాచ్పై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్పందించాడు. దీన్ని ఇతర మ్యాచులు మాదిరిగానే చూస్తామని వ్యాఖ్యానించాడు. అయితే, ఇలాంటి మాటలు తాను కూడా చెప్పినట్లు మాజీ కోచ్ రవిశాస్త్రి గుర్తు చేసుకున్నాడు. గంభీర్ వ్యాఖ్యలకు తాను మద్దతు ఇచ్చినా వాస్తవ పరిస్థితి విభిన్నంగా ఉంటుందని రవిశాస్త్రి పేర్కొన్నాడు. "నేను ఏడేళ్లపాటు ప్రధాన కోచ్గా బాధ్యతలు నిర్వర్తించా. అప్పట్లో నన్నూ ఇదే ప్రశ్న అడిగేవారు. నేను కూడా గంభీర్ చెప్పినట్లే చెప్పా. కానీ, మనం ఆలోచించే దానికంటే భారీ అంచనాలు ఉంటాయి. మేం మీడియా కోసం మాత్రం అలా చెప్పేవాళ్లం. లోతుగా వెళ్తే మాత్రం.. తప్పకుండా విజయం సాధించాల్సిందే. లేకపోతే మళ్లీ వచ్చే మ్యాచ్ వరకూ దీనిగురించే చర్చిస్తారు. అభిమానులు గతంలో ఏం జరిగిందనేది పట్టించుకోరు. గత పది మ్యాచుల్లో పది లేదా తొమ్మిది గెలిచినా మాట్లాడుకోరు. కానీ, ఒక్క మ్యాచ్లో ఓడినా చాలు మళ్లీ భారత్ - పాకిస్థాన్ మ్యాచ్ వరకూ మాట్లాడుతూనే ఉంటారు. అది ట్యాక్సీ డ్రైవర్ లేదా ఇతర ఎవరైనా సరే భారత జట్టుకు ఏమైంది? అని అడుగుతారు. పాకిస్థాన్లో ఇదే పరిస్థితి. పాక్ టీమ్కు ఏమైంది? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కాబట్టి, దాయాదుల పోరంటే ఇతర గేమ్లతో పోలిస్తే పూర్తిగా భిన్నం. 2021లో టీ20 ప్రపంచకప్లో భారత్పై పాక్ గెలిచింది. ఆ తర్వాత మనం విజయం సాధించాం. ఇప్పుడు 50 ఓవర్ల క్రికెట్ మ్యాచ్. అనుభవపరంగా పాక్ కంటే టీమ్ ఇండియా ఉత్తమంగా ఉంది" అని రవిశాస్త్రి తెలిపాడు.

## ఇంటి చిట్కాలు

# ఇనుప పాత్రలు మంచివని వాటిలోనే వంటచేస్తున్నారా, కానీ కొన్ని కూరల్ని అసలే వండకూడదు, అవేంటంటే

ఈ మధ్యకాలంలో ఫుడ్ ఐటెమ్స్‌ని ఐరన్ పాత్రల్లో వండుకుని తినడం చాలా కామన్ అయిపోయింది. వీటి ఎన్నో లాభాలుంటాయని చెబుతారు. అయితే, కొన్ని పదార్థాలని ఇనుప పాత్రల్లో వండకపోవడమే మంచిదని చెబుతున్నారు. అవేంటో తెలుసుకోండి.

మనం కిచెన్‌లో వంటకోసం చాలా రకాల పాత్రల్ని వాడతాం. అయితే, అన్నింటిలో వంటకి వాడాల్సిన పాత్రలేవంటే చాలా ఫస్ట్ లిస్ట్‌లో ఐరన్ ప్యాన్స్ ఉంటాయి. వీటిని వాడడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. అదే విధంగా, ఇందులో వండే పదార్థాలన్నీ కూడా ఎక్కువసేపు వేడిగానే ఉంటాయి. అందుకే, పూర్వకాలం నుంచి ఈ పాత్రల్ని వంటలకి వాడేవారు. ఐరన్ పాత్రల్లో వండిన వంటల్ని తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. మరీ ముఖ్యంగా, ఐరన్ లోపం ఉన్నవారికి ఆ సమస్య దూరమవుతుంది. అందుకే, హెల్త్ పరంగా కూడా చాలా లాభాలున్నాయి. అయితే, ఈ ఐరన్ పాత్రల్లో కొన్ని పదార్థాలను అసలే వండకూడదు. ఇందులో వండితే చాలా సమస్యలొస్తాయి. అవేంటో తెలుసుకోండి.



### డెయిరీ ప్రోడక్ట్స్



ఐరన్ పాత్రల్లో పాలు, డెయిరీ ప్రోడక్ట్స్ వేడి చేయడం, వాటికి సంబంధించిన పదార్థాలను ఇనుప పాత్రల్లో వండి పాలు విరిగిపోతుంది. కెమికల్ రియాక్షన్ కారణంగానే ఇలా జరుగుతుంది. కాబట్టి, వీటిని ఇనుప పాత్రల్లో వండకూడదు. అంతేకాదు, వంటల రంగు కూడా మారుతుంది.

### స్పైసీ ఫుడ్స్



ఇనుప పాత్రల్లో స్పైసీ ఫుడ్స్ వండితే ఐరన్ పాత్రలు ఆ ఫ్లేవర్స్‌ని ఆకర్షిస్తుంది. దీంతోరుచి మారుతుంది. పైగా ఆ ఫ్లేవర్స్ అన్నీ ఇనుము అబ్జార్బ్ అవుతుంది. తర్వాత అందులో చేసే ఫుడ్స్‌కి ఈ రుచి చేరి మొత్తంగా వంటలు పాడయ్యే అవకాశం ఉంది. కాబట్టి, మసాలాలు ఎక్కువగా కలిపిన ఫుడ్స్‌ని ఐరన్ పాత్రల్లో వండకపోవడమే మంచిది.

### టమాటలు



టమాటల్లో అసిడిక్ గుణాలు ఉంటాయి. వీటిని మనం ఐరన్ పాత్రల్లో వండినప్పుడు ఆ పాత్రలకి ఉండే కోటింగ్ పోతుంది. పైగా ఫుడ్‌ని అందులోనే ఎక్కువసేపు ఉంచడం వల్ల కూడా మెటాలిక్ టేస్ట్ వస్తుంది. అలా వండిన టమాట కూరని అసలు తినకపోవడమే మంచిది.

### చేపలు



చేల్లో మరీ ముఖ్యంగా కొన్ని లేతగా ఉండే చేపల్ని ఇనుప పాత్రల్లో వండకపోవడమే మంచిది. కారణం, ఇందులోని మూలకాలు ఐరన్‌తో కలిసి రియాక్షన్ అవ్వొచ్చు. ఆమ్లాలు ఎక్కువగా ఉండే చేపల్ని ఇనుప పాత్రల్లో వండితే రుచి, ఆకృతి రెండూ కూడా మారతాయి. మెటాలిక్ ఫ్లేవర్స్ వస్తుంది.

### కోడిగుడ్లు



కోడిగుడ్లని మనం ఇనుప పాత్రల్లో అసలు వండకూడదు. దీనికి కారణం. గుడ్లు ఇనుప పాత్రలకి అతుక్కునే అవకాశం ఉంది. ముఖ్యంగా పాత్రలు సరిగా సీజనింగ్ చేయకపోతే సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, కోడిగుడ్లని వండకపోవడమే మంచిది.

### సిట్రస్



సిట్రస్ గుణాలు కలిగిన నిమ్మ, పులుపు వంటి పదార్థాలను కూడా ఐరన్ పాత్రల్లో వండొద్దు. దీని వల్ల వంట రుచి మారడమే కాదు, ఐరన్ పాత్రల రంగు మారడం కూడా జరుగుతుంది. కాబట్టి, ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోండి. లెమన్ రైస్, నిమ్మరసం వేసిన పప్పు వంటివి చేయడం అసలు చేయకండి.



